క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మల్కాపురం: మల్కాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని షిప్‌యార్డ్-2, మల్కాపురం 11 కేవీ ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా ఆ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకుంటుందని జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీగ్రామ్,క్రాంతినగర్‌లో, మల్కాపురం ఫీడర్ పరిధిలో గాంధీజీవీధి,హరిజనవీధి,ఇండస్ట్రియల్‌కాలనీ -1,2,జాలరివీధి,పల్లివీధి, శెట్టిబలిజవీధి,నగరాలవీధి ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధిలో...

శ్రీహరిపురం విద్యుత్ ఉపకేంద్రంలో వార్షిక మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. పిలకవానిపాలెం, అన్నపూర్ణనగర్,ఉప్పరకాలనీ,శ్రీరామ్‌నగర్,గొందేశివానిపాలెం,కోడిపందాలదిబ్బ,శ్రీనివాస్‌నగర్,గుల్లలపాలెం,రామ్‌నగర్,కుంచుమాంబకాలనీ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

కార్పొరేటర్ చొరవతో వీధిలైట్ల ఏర్పాటు



విద్యుత్ స్తంభానికి లైట్ అమర్చుతున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు చిన్న ములగాడ నుంచి గొందేశివానిపాలేనికి వెళ్లే మార్గంలో బుధవారం వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ములగాడ - గొందేశివానిపాలెం రహదారిలో చీకటి పడితే చాలు అంధకారం నెలకొంటోంది. ఈ మార్గంలో వీధిలైట్లు లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం. ఈ ప్రాంత వాసులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించిన వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య.. జీవీఎంసీ విద్యుత్ విభాగ అధికారులతో మాట్లాడారు. ములగాడ - గొందేశివానిపాలెం మార్గంలో పలు చోట్ల విద్యుత్ ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో కార్పొరేటర్ లావణ్యకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

శిథిల బడి

ఆ పాఠశాలలో చదివేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ సంఘటన చోటు చేసుకుంటుందోనని కలవర పడుతున్నారు. పాఠశాల పరిస్థితిని చూసి విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను పంపేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఇదే కొనసాగితే ఉన్న విద్యార్థుల సంఖ్య **పూర్తిగా తగ్గిపోయి** పాఠశాల మూతపడినా **ఆశ్చర్యపోవాల్సిన** అవసరం లేదు. **ప్రభుత్వ పాఠశాలలను** పట్టించుకో**వడంలో కూటమి** పాలకులు నిర్లక్ష్యంగా **వ్యవహరిస్తున్నారనడానికి** ప్రత్యక్ష ఉదా**హరణ కొత్తనక్కవానిపాలెం** ప్రాథమిక **పాఠశాల.**



నక్కవానిపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల

భయపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

70 నుంచి 25కి పడిపోయిన విద్యార్థుల సంఖ్య

స్పందించని పాలకులు, అధికారులు



బీటలు వారిన శ్లాబ్



విరిగిన పాఠశాల గది తలుపు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు కొత్తనక్కవానిపాలెం గ్రామంలో సుమారు 15 ఏళ్ల కిందట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల నిర్మించారు. ఇక్కడ తొలిరోజుల్లో ఒకటోతరగతి నుంచి 6 వ తరగతి వరకు బోధించేవారు. కాలక్రమంలో 6వ తరగతిని నిలిపివేసి ప్రస్తుతం ఒకటోతరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలను నిర్వహిస్తున్నారు. పాఠశాల నిర్మించి సంవత్సరాలు గడవడంతో పాటు.. నిర్వహణను పట్టించుకోకపోవడంతో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతోంది.గోడలు బీటలు వారాయి. భవనానికి వేసిన రంగులు పూర్తిగా వెలిసిపోయి అధ్వానంగా మారింది. విద్యార్థులు మంచినీరు తాగే నీటి పంప్ చుట్టూ నాచుపట్టింది. మొత్తం పరిసరాలు చూసినా బూత్ బంగ్లాను తలపిస్తున్నాయి. అలాంటి వాతావరణంలో పాఠశాల నిర్వహిస్తున్నా ఇటు అధికారులు.. అటు పాలకులు కనీసం పట్టించుకోవడం లేదు.

తప్పిన ముప్పు



భవనం నుంచి ఊడిపడిన పెచ్చులు

ఇటీవల విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తుండగా డూమ్ పెచ్చు పడిపోవడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో ఆ సమయంలో పాఠశాలలో ఉన్న విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేశారు. సమస్యను తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపేందుకు భయపడుతున్నారు. దీంతో 70 మంది వరకు ఉన్న విద్యార్థుల సంఖ్య నేడు కేవలం 25కి చేరింది. పాఠశాల పరిస్థితి ఇదే మాదిరిగా ఉంటే ఆ కాస్తా విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతుంది. పాఠశాలను అభివృద్ధి చేయాలని పాఠశాల ఉపాధ్యాయులతో పాటు,విద్యార్థుల తల్లిదండ్రులు పాలకులకు, అధికారుల వద్ద మొరపెట్టుకున్నా ఇంత వరకూ ఎలాంటి స్పందన లేదు.

చాలా భయంగా ఉంది



మా చెల్లి కుమారుడు నక్కవానిపాలెం జీవీఎంసీ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. వాడిని పాఠశాలకు తీసుకు వచ్చే సమయంలో భవన పరిస్థితి చూశాను.చాలా భయం వేసింది. పెచ్చులు ఊడిన దృశ్యాలు, గోడలు బీటలు వారాయి. చాలా అసౌకర్యంగా ఉంది. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు పాఠశాల నుంచి మా మేనల్లుడిని మానిపిద్దాం అని ఆలోచన చేశాం.

– వెంకటరమణ, విద్యార్థి బంధువు

సర్కారుకు చిత్తశుద్ధి లేదు



గత ప్రభుత్వంలో నాడు-నేడు కార్యక్రమం ద్వార పారిశ్రామిక ప్రాంతంలో అనేక జీవీఎంసీ పాఠశాలల రూపురేఖలు మార్చారు. నేడు కూటమి సర్కారుకు ఆ చిత్తశుద్ధి లేదు.నక్కవాని పాలెంలోని జీవీఎంసీ పాఠశాల శిథిలావస్థకు చేరినా కనీసం మరమ్మతులు చేయలేని స్థితిలో ఉన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదనను అర్థం చేసుకుని పాఠశాలకు మెరుగులు దిద్దాలి.

– చట్టి వినయ్‌యాదవ్, మల్కాపురం

చెత్తమయం



ఫోకస్

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల గేటు సమీపంలో సర్వీసు రోడ్డుపై వ్యర్థాలు నిర్లక్ష్యంగా డంప్ చేస్తున్నారు. పాఠశాలకు సమీపంలో ఈ పరిస్థితి ఉండడంతో విద్యార్థులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. దీనికి తోడు ఆ వ్యర్థాల వద్ద పశువులు చేరి పరిసరాలను మరింత అపరిశుభ్రం చేస్తున్నాయి. మరో వైపు అవి ఎక్కడ విద్యార్థులపై దాడి చేస్తాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారు. పాఠశాలకు సమీపంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- మల్కాపురం

మల్కాపురం సబ్‌స్టేషన్ కేంద్రంలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు

మల్కాపురం: మల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ బిల్లులు చెల్లించే సౌకర్యాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్, ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా చాలా మంది వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ కారణంగా వారు ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి బిల్లు కంటే అదనంగా కొంత మొత్తం చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను గుర్తించిన మల్కాపురం సబ్‌స్టేషన్ అధికారులు ప్రతి నెలా 7, 14, 24 తేదీల్లో(నెలలో మూడు రోజులు) విద్యుత్ బిల్లులు చెల్లించుకునే సౌకర్యాన్ని కల్పించారు. వినియోగదారులు సూచించిన తేదీల్లో మల్కాపురం సబ్‌స్టేషన్ కేంద్రం వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల సమయంలో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు.

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు



మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

గోపాలపట్నం: బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించ వద్దని జిల్లా సివిల్ జడ్జి వెంకట శేషమ్మ అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పోక్సో చట్టం- బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న హింసను అడ్డుకునేందుకు చట్టాలు ఉన్నాయన్నారు. బాలికలను మానసికంగా, శారీరకంగా హింసకు గురి చేస్తే పోలీసులు పోక్సో చట్టం ద్వారా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ వహించాలని, వారితో ప్రతి రోజూ కొద్దిసేపు గడపాలని సూచించారు. పిల్లలతో మాట్లాడితే వారి మనసులో ఉన్న బాధను, సంతోషాన్ని స్వేచ్ఛగా పంచుకోగలుగుతారన్నారు. లైంగిక వేధింపులకు గురైతే ధైర్యంగా బాలికలు వారి తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యాయులకు తెలియపరచాలని చెప్పారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షణ జేసీడీవో ఖలీఫా బేగం, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం జోగి మాస్టార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల రక్షణకు ఉద్యమించాలి



ర్యాలీలో నినాదాలు చేస్తున్న మహిళా సంఘాల నాయకులు

సీతంపేట: ఉద్యమాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న మహిళల హక్కులను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవం సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సదస్సు, ర్యాలీని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి ప్రతి మహిళా పోరాడాలని పిలుపునిచ్చారు. పురుషులతోపాటు మహిళలు అన్ని రంగాల్లో సమానమేనని, అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనువాదాన్ని తీసుకొచ్చి మహిళల హక్కులను కాలరాయడానికి కుట్ర పన్నిందన్నారు. ఇకనైనా మహిళలంతా మేధావులు, అభ్యుదయవాదులతో కలిసి హక్కుల కోసం ఉద్యమించాలన్నారు. ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు వివక్షకు గురవుతున్నారని, పురుషుల చెప్పుచేతల్లో మహిళలు ఉండేలా మను ధర్మం చేసిందన్నారు. మను ధర్మం తీసుకురావడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ వంటి హిందూ ఫాసిస్టు సంస్థలు కుటిల పన్నాగాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని హిందుత్వ ప్రభుత్వం రద్దు చేయాలని ప్రయతిస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి సమాజాన్ని ఫాసిస్ట్ దేశంగా చేయడానికి బీజేపీ కుట్ర పన్నిందన్నారు. పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఇందిర, జిల్లా ఉపాధ్యక్షురాలు బాల నాగమ్మ, భారత నాస్తిక సమాజం జిల్లా కార్యదర్శి వై.నూకరాజు, అమరవీరుల మృతుల కమిటీ ప్రతినిధి పద్మ, చైతన్య మహిళా సమాఖ్య ప్రతినిధి లలిత, మురికివాడల సంఘం నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. రూ.47 లక్షలతో లక్ష్మీ నగర్ డీఏవీ స్కూల్ నుంచి అమ్మ వారి పాదాలు వరకు, అదే విధంగా కాలనీలోని అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిమిత్తం వెచ్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గంగాధర్, శ్రీనివాస్, నానాజీ, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఉపవాస దీక్షలు ప్రారంభం

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు జయప్రకాష్‌నగర్‌లోని ఎరుసలేమ్ చర్చిలో 40 రోజుల ఉపవాస దీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 40 రోజుల పాటు క్రీస్తు భక్తులు ఉపవాసాలు చేస్తారు. బుచ్చిరాజుపాలెం ఎరుసలేం చర్చి సంఘ కాపరి సిస్టర్ పీస్ ఏంజెల్ పలు రాష్ట్రాలకు చెందిన 20 మందికి పైగా పాస్టర్లతో ప్రత్యేక ప్రార్థనలు కొనసాగుతాయని సిస్టర్ బ్లెస్సీ తెలిపారు. ప్రార్థనల్లో భక్తుంతా పాల్గొని ప్రభువు కృపకు పత్రులు కావాలని కోరారు. తొలి రోజు సింగపూర్‌కు చెందిన పాస్టర్ డానియల్ మోడీ ప్రవచనం చేశారు.

పథకాలపై అవగాహన అవసరం



ప్రశంసాపత్రాలు అందుకున్న మహిళలతో అతిథులు, అధికారులు

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు ఊర్వశి కూడలి పరిధి జై భారత్‌నగర్‌లో కేంద్ర ప్రభుత్వ సాంఘిక భద్రతా పథకాలపై ధోత్‌పంత్ తెంగడి జాతీయ కార్మిక విద్యా - అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ గంకల కవిత సదస్సు ప్రారంభించి మాట్లాడారు. స్వల్ప వ్యవధి శిక్షణతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ - శ్రమ్ పోర్టల్‌లో చేరిన కార్మికులు ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన కింద రూ.2 లక్షల వరకు ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. కార్మిక విద్యాధికారి రెడ్డి నాగార్జున మాట్లాడుతూ కార్మికులందరూ విధిగా కేంద్ర ప్రభుత్వ సాంఘిక భద్రత పథకాల కోసం నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. శ్రమ యోగి మానధాన్ ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన, అటల్ పెన్షన్ యోజనపై అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన మహిళ ల కు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జి.అప్పారావు, ధరణి సోషల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యు డు హరి, హెచ్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



రూనీస్

గోపాలపట్నం: బయటకు వెళ్లిన యువతి ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టు జోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు.. పంజాబ్ హోటల్ జంక్షన్ సమీప రాజీవ్‌నగర్‌లో గురుగుబిల్లి రూనీస్ (24) తల్లిదండ్రులతో నివాసముంటుంది. గత నెల 25న మధ్యాహ్నం సమయంలో స్నేహితురాలిని కలిసి వస్తానని వెళ్లిన రూనీస్ ఎంతకీ తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల వాకబు చేశారు. ఆమె స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికారు. ఆచూకీ తెలియక పోవడంతో ఎయిర్ పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువతిని ఎవరైనా గుర్తిస్తే 9440904350, 7396158759 నంబర్లకు సమాచారమివ్వాలని సీఐ ఉమహేశ్వరరావు కోరారు.

పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ గ్రామంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, స్థలాలు ఉన్న వారికి పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నిరసన చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో సొంతంగా ఇళ్లులేని వారు చాలా మంది ఉన్నారన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఈ నెల 10వ తేదీన తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తున్నామన్నారు. పేదలు తరలి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరంలో ఏయూ విద్యార్థుల ప్రతిభ

విశాఖ విద్య: కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లోని ఎస్‌వోఏ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎనిమిది మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఒక ప్రోగ్రాం అధికారి పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో 11 రాష్ట్రాల విద్యార్థులు పాల్గొనగా.. ఏయూ వలంటీర్ల బృందానికి బృంద నృత్యంలో ప్రథమ బహుమతి లభించింది. డిబేట్ పోటీలో వై.సాయి ప్రణతి మొదటి బహుమతి, వ్యాస రచనలో కె.లక్ష్మీప్రసన్న రెండో బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ విద్యార్థులను అభినందించారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

జోన్-5 కమిషనర్ రాము



నీటి తొట్టెను పరిశీలిస్తున్న జెడ్సీ రాము

విశాఖ విద్య: పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి జోనల్ కమిషనర్ బి.రాము సూచించారు. జోన్-5 పరిధి 52వ వార్డులోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. కాలనీల్లో శానిటేషన్ పనులు ఎలా చేస్తున్నారో పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య సిబ్బంది సేవాభావంతో విధులు నిర్వహించాలన్నారు. జోన్ పరిధిలోని సంబంధిత విభాగాల అధికారులు కాలనీల్లో తరచూ పర్యటించాలని ఆదేశించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు వ్యర్థాలు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఈ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పర్యవేక్షణ అధికారులు క్షేత్రస్థాయిసిబ్బందికి అందుబాటులో ఉండాలన్నారు. పర్యటనలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి పైడిమాంబ ఉత్సవాలు



జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట గ్రామ ఇలవేల్పు పైడిమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల పోస్టర్‌ను ఆర్పీ పేట గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం గ్రామాధ్యక్ష, కార్యదర్శులు దాడి గోవిందరాజు, బొడ్డేటి చిన్న నర్సింగరావు, పాలకవర్గ సభ్యులు ఆవిష్కరించారు. ఈ నెల 10న తొలేళ్ల ఉత్సవంలో భాగంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు, పుట్టబంగారం ఆలయం వద్ద పూజాధికాలు జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 11న ప్రధాన జాతర, ఈ నెల 18న అమ్మవారి మారువారం, భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. సాంస్కృతిక, నృత్య కార్యక్రమాల నిర్వహణకు వేదికలను, ఆలయానికి విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కాండ్రుగుల వెంకటేశ్వరరావు, పెంటకోట శ్రీనివాసరావు, బొడ్డేటి పైడిరాజు, ఆళ్ల పైడిరాజు, కర్రి సురేష్, బుద్ధ శేఖర్, మద్దాల అప్పారావు, కార్యవర్గ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.